# మృత్యువు నవ్వుతోంది

మా వీర్రాజుని శానిటోరియంలో చేర్పించారనే వార్త చాలా భయాన్నీ, బాధనీ కలిగించింది. అతనికి ముందు ముందు మంచి భవిష్యత్తు ఉంటుందని అభిప్రాయపడుతున్న నాకు, యీ వార్త తెలిసినతరువాత, అతని మీద జాలేసింది.

మా కామేశ్వరికి అతను ఏదో దూరపు చుట్టం. వరసకు మరిది అవుతాడు. బంధుత్వంకన్న స్నేహమే ఎక్కువ. రెండు మూడు ఆదివారాలకు ఒకసారి వచ్చి ఒకటీ రెండు గంటలు పిచ్చాపాటీ మాట్లాడి వెళ్ళిపోతుంటాడు.

నెల పదిహేను రోజులుగా అతను కనిపించక పోయేసరికి ఒకరోజు కామేశ్వరిని అడిగాను.

ఇవ్వాళ్ళ కామేశ్వరి భోజనం వడ్డిస్తున్నపుడు చెప్పింది. "వీర్రాజుని శానిటోరియంలో చేర్పించారుటండీ. ఓసారి వెళ్ళి చూసిరాగూడదూ" అని.

ఆ తర్వాత ఆవిడే చెప్పింది. "అట్టే ప్రమాదమేమీ లేదుటకానీ, ఎడమ వైపు ఊపిరితిత్తిలో కొద్దిగా జబ్బు ప్రవేశించిందట. తెలిసిన ఒక డాక్టరు ఎవరో వుంటే దగ్గరుండి చేర్పించారట. నిన్న సాయంకాలం సుబ్రహ్మణ్యం గారు వచ్చినప్పుడు చెప్పారు. ఆయనకు కూడా తెలీదట. ఎవరికీ చెప్పకుండా చేరిపోయి ఆ తర్వాత ఉత్తరం రాశాడట. సాయంకాలం ఆఫీసునుంచి ఒకసారి అలావెళ్ళి చూసిరండి. తర్వాత మనిద్దరం కలిసివెళ్దాం" అంది.

ఆ సాయంకాలం అతన్ని చూసొద్దామని బయలుదేరాను. బస్సులో ఉన్నంతసేపూ మనసు బితుకు బితుకు మంటూనేవుంది, అతన్ని ఎలాంటి స్థితిలో చూడాల్సి వస్తుందో అని.

నెలా పదిహేనురోజుల కిందట అతన్ని చూసినప్పుడు మనిషి బాగానే వున్నాడు. ఆరోజు కామేశ్వరికూడా యింట్లోలేదు. వాళ్ళ బాబాయిగారింటికి వెళ్ళింది. మధ్యాహ్నం వచ్చినవాడు, ఆ సాయంకాలం వరకూ వున్నాడు.

"సినిమాకు వెళ్దాం, రండి" అన్నాను.

"వంట్లో బావుండలేదు. మీరు వెళ్ళండి, నేను రాలేను" అన్నాడు.

ఆమాటకు అర్థం ఇంత బలమైనదని అనుకోలేదు ఆరోజున.

బస్సుదిగి హాస్పిటలులోకి అడుగుపెట్టగానే గుండె దడదడ లాడింది. హాస్పిటల్‌లోకి వెళ్ళడం అంటేనే నాకు భయం. విచిత్రమయిన ఆ పరిసరాల వాసనను భరించలేను నేను.

మాలిన్యాన్ని అసహ్యించుకొనే తెల్లటి బట్టల్లోని ఆమ్మాయిలు, మనిషిలోని జబ్బుల్ని, పురుగుల్ని తప్ప వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోలేని డాక్టర్లు, చావుబతుకుల సందిట్లో బతకాలనే ఆశ చచ్చిపోని కళ్ళల్లో రాలిపోతున్న వెలుగును ఎగదోసే ప్రయత్నాలు—వీటన్నిటినీ చూస్తూ భరించలేను నేను. వాటికి సన్నిహితంగా వెళ్ళే ప్రయత్నాలు ఎప్పుడూ చేయలేదు.

చాలాకాలం క్రితం ఒకసారి కొద్దిగా జ్వరం వచ్చింది. డాక్టరు ఏదో ఇంజక్షను యిచ్చాడు. అప్పటినుండీ మళ్ళీ ఇంజక్షను ముఖం చూడలేదు. అదంటే నాకు భయం.

లోపలకు వెళ్ళి, రెండు-మూడు వార్డులు వెతికాను కాని లాభం లేకపోయింది. అలాంటివి చాలా వార్డులు వున్నాయక్కడ. మరికాస్సేపు వెతికితే చివరకు అతనువుండే వార్డు దొరికింది.

అక్కడున్న నర్సుని అడిగాను.

"కొత్తగా వచ్చిన అతనేనా?" అని అడిగింది. కొన్ని గుర్తులు చెప్పింది.

"అతనే" అన్నాను.

"సాయంకాలం కదండీ, 'వాకింగ్'కు వెళ్ళుంటారు. అతనూ, మరో అబ్బాయీ రోజూ అటువయిపుగా వెళ్ళి ఏ రాతిబండమీదనో కూర్చుంటారట.

చీకటి పడిన తర్వాతగాని రారు. ఇలాగే వెళ్ళండి, బహుశా మీకు కనిపించ వచ్చు" అంది.

వార్డును ఆనుకుని దూరంగా వేపచెట్లలో కలిసిపోయిన కాలిబాటను చూపించింది

అక్కడినుండి కదిలి ఆమె చూపించిన వైపుగా బయలుదేరాను. నాలుగడుగులు వేసి వెనక్కు తిరిగి చూస్తే ఆమె అక్కడే నిలబడి నన్నే చూస్తోంది. చూసిన తర్వాత దృష్టి మార్చుకోవడం యిష్టంలేక మళ్ళీ వెనక్కు వచ్చి "ఒక్క విషయం! మావాడికి ఎలావుందండి? పరవాలేదుకదా?" అన్నాను.

ఆమె నవ్వింది.

"పరవాలేదులెండి, హాయిగా వున్నాడు. కాలక్షేపానికి నిత్యానంద మూర్తి అనే ఓ అబ్బాయి దొరికాడు—వాగుడుకాయ" అంది.

ఆమె మాటలతో ధైర్యాన్ని నింపుకుని, ఆమె చెప్పినవైపుగా బయలు దేరాను.

చుట్టూ చిట్టడివిలా కనుపించినంతమేరా వేపచెట్లు, చెట్ల అడుగున యెక్కడికక్కడే వంకరటింకర్లుగా కాలిబాటలు, బాటలపక్కనే గడ్డిలో కలిసి విరియబూసిన అడవి చేమంతి—వాటన్నింటినీ దాటుకొని అయిదు నిమిషాలు ఆమె చూపించినవైపు నడవగా, దూరంగా ఓ రాతిబండమీద ఎర్రని నీరెండ వెనుక, మసకగా ఎవరో యిద్దరు కూర్చొని కనిపించారు.

దగ్గరకు వెళ్ళాను.

వారే!

పిలిచేవరకూ నన్ను చూడనేలేదు.

చూశాక నవ్వి "మీకెవరు చెప్పారు? ఇంకా నేను ఉత్తరం వ్రాద్దామను కొంటున్నాను" అన్నాడు.

అతన్ని ఎలాగెలాగో చూడబోతున్నట్టు ఊహించుకున్న నేను, అతన్ని చూసిన తర్వాత ధైర్యంగా, తెలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

అతనితో మాట్లాడుతున్న అతన్ని నాకు పరిచయం చేశాడు. తన పక్క మంచమేనట అతనిదీనూ. పేరు నిత్యానందమూర్తి అట.

ఈ నిత్యానందమూర్తినే అంతకు ముందు నర్సు 'అబ్బాయి' అని అనడంచూస్తే చాలా ఆశ్చర్యం వేసింది నాకు ఇంచుమించు పాతికేళ్ళుంటాయి. ఆ నర్సుకన్నా కనీసం ఆరేడేళ్ళు అయినా పెద్దవాడు కావచ్చు. అలాంటి వ్యక్తిని అమాంతంగా ఓ చిన్న పిల్లవాడిలా జమకట్టి 'అబ్బాయి' అని అనడం అదోలా అనిపించిందినాకు. బహుశా నర్సులు వయసుకు, ప్రేమలకు అతీతులేమో.

"ఎలావుంది యిక్కడమీకు?" అన్నాను.

"ఫరవాలేదు. ప్రకృతీ పరిసరాలూ అందమైనవి. ఒంటరి తనాన్ని నెట్టివేసే మిత్రులు ఏర్పడ్డారు. హాస్పిటల్ అనే విషయం మర్చిపోతే చాలా ఆహ్లాదకరమైన జీవితం. కాని, హాస్పిటలు అని మర్చిపోవడం మాత్రం ఎవరికీ సాధ్యంకాదు" అన్నాడు వీర్రాజు.

అతను చెప్పింది యథార్థమే అనిపించింది నాకు. హాస్పిటలు దాటి ఫర్లాంగు దూరం నడిస్తే విశాలమైన మైదానం, మైదానానికి ఆవల వరుసలు తీర్చిన కొండలు, కొండల దిగువన మైదానంలోనూ అక్కడక్కడ బయటకు పొడుచుకొచ్చిన బండరాళ్ళు-వీటన్నిటిమధ్యా నీరెండ కురిసిన సాయంకాలాలూ మంచులో తడిసిన ఉదయాలూ ఎంత అందంగా అలంకరించుకుంటాయి యిక్కడ!

ఇల్లాంటి ప్రకృతిలో నన్ను వదేస్తే పిచ్చిగా కథలు రాసుకుంటూ ఎప్పటికీ యిక్కడే వుండిపోతాను.

"మిమ్మల్ని చూస్తే చాలా అసూయగా వుంది" అన్నాను.

వీర్రాజు నవ్వాడు.

"నిజమే. ఈ ప్రకృతినిచూస్తే మీలాంటి కథకులకు అలాగే అనిపిస్తుంది. నిత్యం తుషారబిందువులు రాలే మృత్యుచ్ఛాయల శీతల సమాధి యిది. ఈ సమాధిలో ఎన్ని జీవితాలు నెలలకొలదీ చీకట్లో కూరుకుపోయాయో, యింకా ఎన్ని అలాంటివి వందలు, వేల సంఖ్యలో జరగబోతాయో ఆలోచించడం

మానేస్తే ఈ ప్రదేశాన్ని నేనూ ప్రేమించేవాడిని. కాని అలా ఆలోచించకుండా వుండడం నాకు సాధ్యం కావడంలేదు" అన్నాడు.

ముగ్గురం చాలాసేపు కూర్చొని మాట్లాడుకున్నాం.

ఆకాశంలో శిక్షణకయి ఎగురుతోన్న విమానాలు దీపాల్ని వెలిగించుకొని తిరుగుతున్నాయి. కాస్త దూరంలో పాడయిపోయిన మిలిటరీ బేరక్సులో మొలిచిన తుప్పల్లో ఏదో పక్షి తీతువులా భయంకరంగా అరచి పారిపోయింది. కొండకావల అడవిలోంచి కట్టెల్ని తెచ్చుకొంటున్న ఇద్దరు లంబాడీ స్త్రీలు నిశ్శబ్దపు చీకట్లో భయంకరంగా కదిలి వెళ్ళిపోయారు.

"వెళ్ళిపోదామా?" అన్నాను, ఇద్దరివైపూ చూసి.

"కూర్చోండి. ఆత్మీయుల అభిమానానికీ, ప్రేమకూ దూరమయిన మాకు మీలాంటి ఆప్తులరాకలే కొండంత ఉత్సాహాన్ని కలిగిస్తాయి. మీతో గడిపిన ఈ కొద్దిపాటి నిమిషాలే రాత్రి నిద్రపోబోతూ మధురంగా ఆలోచించుకోవడానికి భయంకరమైన ఈ వాతావరణాన్ని ఆలోచనల్నుండి తప్పించుకోవడానికీ, కలలు కనడానికీ కారణాలవుతాయి. మీరు వెళ్ళిపోతే మళ్ళీ మాకు మామూలు జీవితం—కాఫ్ మిక్చర్....వార్డ్‌బోయ్!....స్ట్రెప్టోమైసిన్....సిస్టర్!....బ్రోమైడ్....డాక్టర్!—ఇదీ ఇక్కడి జీవితం"—అన్నాడు నిత్యానందమూర్తి.

అతని కళ్ళల్లో రాత్రి వెలిగించిన ఆకాశదీపాల మసక వెలుతురు మెరిసినట్టనిపించింది. అతని కంఠంలో అంతవరకూ ఉరుకులెత్తిన ఉత్సాహపు పొంగు అణగారిపోయి శివరంజనీ స్వరాలు కదలినట్టనిపించాయి.

ఎవరూ మాట్లాడ్డంలేదు. ప్రకృతీ, పరిసరాలూ నిశ్శబ్దంగా వున్నాయి. అప్పుడప్పుడు శిక్షణకయి ప్రదక్షిణ చేస్తోన్న విమానం, ఉండి ఉండి భయంకరంగా శబ్దం చేసుకొంటూ పోతోంది. చీకటిలో దాని ఎర్రటి, పచ్చటి దీపాలు రెక్కల్లో రంగుల్ని నింపుతున్నాయి. ఎదురుగా దూరంలోని నల్లటి కొండలు, ఆపైని ముదురునీలమూ నలుపూ కలిసిన రంగులో తెలుపు పడి పాలిపోయినట్టు ఆకాశం, కింద పలుచని చీకట్లో పదిరంగులూ కలిసి ఏ రంగూ తెలీనట్లున్న మైదానం—చూస్తూండగానే పావుగంట మౌనంగా గడిచిపోయింది.

"ఎప్పుడన్నా ఉదయంపూట రండి అలా కొండల మీదకు వెళ్ళి వద్దాం" అన్నాడు నిత్యానందమూర్తి.

"అలానే" అన్నాను.

కొండలంటే చాలా యిష్టంనాకు. కొండపైన ఎత్తైన రాతి ఫలకమీద వెల్లికితలా పడుకుని ఆకాశంలోకి చూస్తూ ఎంత సేపయినా ఉండిపోగలను.

మరికాస్సేపు కూర్చుని ముగ్గురమూ లేచిపోయాం. చీకట్లో కరిగి హాస్పిటలుకు బయలుదేరాం.

హాస్పిటలు చెట్ల గుబురుల్లో తెల్లగా వెలిగిపోతోంది. నిశ్శబ్దంగా పరిసరాలు నిద్రపోతున్నాయి.

"అన్నట్టు! మేం ఈ రాతిబండమీద వున్నట్టు ఎవరు చెప్పారు?" అన్నాడు వీర్రాజు.

"వార్డులోవున్న నర్సు చెప్పింది" అన్నాను.

"ఎవరూ, ఆగ్నేసా?" అన్నాడు నిత్యానందమూర్తి.

"ఏమో, ఆమె పేరు నాకెలా తెలుస్తుంది. సన్నగా, చామన చాయలో వుంది" అన్నాను.

నిత్యానందమూర్తి మెల్లగా నవ్వుకొని "ఇంకెవరూ ఆగ్నేసే. ఇంకా ఏమన్నా చెప్పిందా మాగురించి?" అన్నాడు.

అతన్ని ఓ చిన్నపిల్లవాడిగా, వాగుడుకాయగా నా ముందు నిలుచో బెట్టిందని చెప్పి అతన్ని చిన్నబోయేట్టు చేయడం నాకిష్టంలేదు.

"ఇంకేమీ చెప్పలేదు. మావాడికి కాలక్షేపంగా మంచి మిత్రుడొకడు దొరికాడని మాత్రం అంది" అన్నాను.

అతను ముసిముసిగా నవ్వుకున్నాడు.

హాస్పిటలు దగ్గరకు వచ్చిన తర్వాత తనలో తనే మళ్ళీ మరొకమారు నవ్వుకొని "భలేమనిషి!" అన్నాడు అస్పష్టంగా.

"ఎవరూ?" అన్నట్టుగా నిత్యానందమూర్తివైపు చూశాను. అతనేమీ మాట్లాడలేదు. వీర్రాజు యిదేమీ గమనించకుండా నడుస్తున్నాడు.

వార్డులోకి వెళ్ళేసరికి నర్సు వాళ్ళగురించే ఎదురు చూస్తోన్నట్టుగా గుమ్మంవద్ద నిలబడివుంది.

"ఇంతసేపూ చలిలో యెక్కడ తిరుగుతున్నారు? చలికి రొంపచేసి తలనొప్పివస్తే మళ్ళీ సిస్టర్లని సతాయిస్తుంటరా ఎ.పి.సి. పౌడరు కావాలని, అది కావాలని, యిది కావాలని. ఉదయం డాక్టరు రానీయండి—చెప్తాను. ఆ కొత్తాయన మంచంమీదనుండి కదిలేవాడేకాడు. ఈ నిత్యానందమూర్తి చేరి ఆయన్నుకూడా చెరుస్తున్నాడు" అంది.

ఆమె మాటలు మరీ ముద్దగా. ఏసగా వున్నాయి. ఆ ఏస లేకపోతే మరోసారి ఆమె కంఠం విందామనిపిస్తుంది.

"భోజనాలు వేరే తీసివుంచాను. వెళ్ళి భోంచెయ్యండి. రోజూ యిదోపని అయిపోయింది నాకు" అంటూ గొణుక్కుని లోపలకు వెళ్ళిపోయింది ఆమె.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంత చిరబురలాడే మనుషులు నరసులుగా పనికిరారు. రోగులతో కలిసిమెలిసి నవ్వుతూ, నవ్విస్తూ బాధల్ని మరిపింపజేయాలిగాని యిలా అధికారం చెలాయించడం, మాటిమాటికీ విసుక్కోవడం మంచిపనికాదు. ఆప్తుల పరిచర్యలకు, ప్రేమలకు దూరమయిన వ్యక్తులకు తమ సేవలతో ఉత్సాహాన్ని, బ్రతుకుమీద ఆశనూ కలిగించాలి. తమ దురదృష్టాన్ని తలంచుకొని వారు బాధపడకుండా చేయాలి. వైద్యశాస్త్రం ఎంత బలమైనదైనా మానసిక ఆనందమూ, తృప్తీ లేనిదే ఏ మందూ పని చెయ్యదు. అందులోనూ టి.బి. లాంటి భయంకర వ్యాధి నివారణ మానసిక శాంతి, గుండె నిబ్బరంమీద ఎక్కువగా ఆధారపడి వుంటుంది.

ఆ నరసుమీద నాకు చాలా కోపం వచ్చింది.

అయినా ఏమీ చేయలేక, వెళ్ళిపోతున్నప్పుడు కొరకొరా ఆమెవంక చూసి వెళ్ళిపోయాను. నేను అలా కోపంగా చూడడం ఆమె చూసింది. నేను వెళ్ళిపోయాక ఆమె నవ్వుకున్నదేమో నాకు తెలీదు.

పదిహేను రోజుల వరకూ మళ్ళీ అటువెళ్ళలేదు. ఎప్పటికప్పుడు కామేశ్వరిని తీసుకుని వెళ్దాం అనుకుంటూనే ఏదో ఒక ఆటంకంవచ్చి వెళ్ళడం పడలేదు. చివరకు నేను ఒకడ్నే ఓ ఆదివారం బయలుదేరాను.

ఉదయం పూట కాస్త తీరిగ్గా కూర్చుని పుస్తకం చదువుకొంటున్నాడు వీర్రాజు. నిత్యానందమూర్తి, మరో యిద్దరూ విడిగా కూర్చుని పేక ఆడుతున్నారు. నన్ను చూసి పేక ఆపేసి వచ్చాడు నిత్యానందమూర్తి.

"ఆదివారం డాక్టర్ల 'రౌండ్సు' ఉండవు. ఏమీ తోచక పేక ఆడుతూ కూర్చున్నాను" అన్నాడు.

వీర్రాజు బట్టలు వేసుకున్నాడు, అలా కొండలమీదకు వెళ్ళి వద్దామని, నిత్యానందమూర్తికూడా బయలుదేరాడు.

"పొద్దుటే ఎక్కడకు బయలుదేరారు?" అంది ఆగ్నేసు డ్యూటీరూం బయటనుంచొని.

"కొండలమీదకు వెళ్ళివద్దామని"

"వెళ్ళండి మీమీద రిపోర్టు రాసిపెడతాను. ఇలా యిష్టం వచ్చినట్టు తిరగడానికేమిటి హాస్పిటల్లో చేరింది అంతగా వెళ్ళాలనుంటే సాయంకాలం వెళ్ళండి. వాకింగ్ అవర్స్‌లో" అంది ఆమె.

"పోనీలెండి. ఇక్కడే కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాను నేను.

"భలేవారే! ఆమె కోప్పడుతుందనా. అదేమీలేదులెండి. కోపం వున్న చోట అభిమానమూ, ప్రేమా తప్పకుండా వుండి వుంటాయి. కావలసినవారు కానిపని చేస్తున్నారంటే కోపం రావడం అసహజమేమీ కాదులెండి" అన్నాడు నిత్యానందమూర్తి వెనక్కుతిరిగి ఆమెవైపు చూస్తూ.

ఆమె మారు మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. ముగ్గురమూ బయలుదేరాం.

అర్ధగంట నడిచి కొండ అంచు చేరుకున్నాం. కొండ దిగువన, కొండ మధ్య అక్కడ అన్నీ గడ్డిదుబ్బులే!

ఆ గడ్డిదుబ్బుల్ని తప్పించుకొని, రాళ్ళను దాటుకుని కొండ అంచుల మీదుగా శిఖరాన్ని చేరుకున్నాం. అదోరకమైన అనుభవం.

అక్కడనుండి చూస్తే చుట్టూ వరుసగా నిలబడిన కొండలు ఒకవైపు, దూరంగా చెట్లలో దాగిన హాస్పిటలు శిఖరాలు మరోవైపు, కొండల్లోంచి చూసు

కొనిపోతున్న రైలుపొగ, యింకా దూరంగా ఏరోడ్రోములో రెక్కల్ని చాచుకుని ఎగురుతోన్న విమానాలు. అన్నింటినీ విస్తరించి తలమీదకు వంగిన విశాలమైన ఆకాశం—ఇల్లాంటి అందం అందరికీ లభ్యంకాదు.

"పట్టణంలో యిల్లాంటి పల్లెటూరి అందం కొనుక్కోవాలంటే ఎంత తగలెయ్యాలి?" అనేవాడు తరచుగా కేశవరావు, యిల్లాంటి అందాన్ని చూసినప్పుడల్లా.

వీర్రాజు నిటారుగావున్న కొండ అంచు చివర నుంచుని "ఇల్లాంటి అందమైన ప్రదేశంలో చావురావడం కూడా ఓ అదృష్టమే అనిపిస్తుంది నాకు" అన్నాడు.

నాకెందుకో భయం వేసింది. అతన్ని వెంటబెట్టుకుని కొండమీదకు వెళ్ళిపోయాను.

ఆ కొండమీద హనుమంతుడి విగ్రహం ప్రతిష్ఠించి వుంది. దాని వెనుక రెండు నీటిగుండాలు వున్నాయి. గుండాలను ఆనుకుని పెద్ద రాతిబండ వుంది. ముగ్గురమూ వెళ్ళి దాని నీడలో కూర్చున్నాం.

"అందమయిన సాయంకాలాలు నిరర్థకంగా యీ కొండల్లో ఎన్ని ఎర్రగామండి, నల్లని నుసియై రాలిపోతున్నాయో" అన్నాడు నిత్యానందమూర్తి.

"ప్రకృతి అందం ఏ ఒక్కరిదీకాదు, అందరిదీనూ. అది వ్యర్థంగా రాలిపోతోంటే కొంతమంది చూస్తూ ఊరుకోలేరు" అన్నాడు వీర్రాజు.

నాకూ అలానే అనిపించింది. నా జీవితమంతా నాగరికత నిర్మించిన కృత్రిమ తెరల మధ్యనే గడిచిపోయింది. ఎప్పుడయినా యిలా నగ్నంగా ప్రకృతిని చూసినప్పుడు, ఈ అందాన్ని నేను అనుభవించలేక పోతున్నానన్న బాధ కలిగి, మనసు అసంతృప్తితో నిండిపోతుంది.

చాలా సేపు కూర్చుని మాట్లాడుకున్నాం. హాస్పిటల్, నర్సులు, విమానాలు, ప్రయాణాలు, ఆఖరిగా కొండల్లో సినిమా షూటింగులు - ఎన్నెన్నో ఆ మాటల్లో దొర్లిపోయాయి.

సూర్యుడు కొండల మీదకు ధనుస్సులా ఒంగుతున్నాడు. మబ్బుతునకలు అప్పుడప్పుడు పిసినారిలా వెలుతుర్ని దాచేసుకుంటున్నాయి. అంద

మయిన లేండ్ స్కేప్ చిత్రాల్లోకి ఒకటి, రెండు పక్షులు తొంగిచూసి పారి పోతున్నాయి.

"ఇక వెళ్ళిపోదామా, నరుసుకూడా కోప్పడుతుందేమో మిమ్మల్ని. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది" అన్నాను లేచి నుంచుంటూ. నిజానికి నాకు కూడా వేరే పనివుంది.

"కోపం ఏమీకాదులెండి. అది అసూయ" అన్నాడు నిత్యానందమూర్తి.

ఇద్దరూ లేచి నుంచున్నారు.

మెల్లగా కొండ దిగుతున్నాం.

కొండ పగుళ్ళల్లోనూ కొండ దిగువ తుప్పల్లోనూ ఎక్కడబడితే అక్కడ నిండుగా గొబ్బి పూలు పూసి వున్నాయి. నిత్యానందమూర్తి దోసిలి మేరకు పూలను కోసుకున్నాడు.

మౌనంగా మైదానంలోంచి నడుస్తున్నాం. నేలమీద నిటాగ్గా నిలుచున్న గడ్డిచేమంతి తలలు పాదాలకేసి కొట్టుకొని దూరంగా ఎగిరిపడుతున్నాయి. మైసూరునుంచి విద్యుచ్ఛక్తి మోసుకొచ్చే తీగలమీద రెండు పాలపిట్టలు దగ్గరగా కూర్చుని మాట్లాడుకుంటూ అలికిడిని విని పారిపోయాయి.

"ఆడవాళ్ళకు అసూయ ఎంత వేగంగా కలుగుతుందో చూశారా!" అన్నాడు నిత్యానందమూర్తి, అకస్మాత్తుగా నిశ్శబ్దాన్ని నెట్టేస్తూ.

'ఏమిటీ' అన్నట్టుగా చూశాను అతనివైపు.

"కొత్తగా మా వార్డుకు స్టూడెంటునర్సు ఒక అమ్మాయి వచ్చింది. ఆమెతో సరదాగా మాట్లాడుతుంటే ఆగ్నేసుకు కోపం. నాతో మాట్లాడుతుంటే ఏదో పనిచెప్పి తీసుకుపోతుంది ఆమెను. ఇదంతా ఏమిటంటారు?" అన్నాడు.

నాకు ఏమని అనడానికీ తోచలేదు. అతనే తిరిగి చెప్పాడు.

"ఆగ్నేసు భలే అల్లరి చేస్తోంది లెండి. ఉత్తరాలు వస్తే యివ్వకుండా దాచేసి ఏడిపించడం, కళ్ళతోనే మాట్లాడడం, వ్యంగ్యంగా సమాధానాలు యివ్వడం, లాకరుమీది పుస్తకాలు తెలీకుండా తీసుకుపోవడం-ఇవన్నీ చూస్తే మనసు పిచ్చెత్తిపోతోంది" అన్నాడు.

నిత్యానందమూర్తి ఏ విషయాన్ని తెలియజేయడానికి ఇవంతా చెప్పు కొచ్చాడో ఆ విషయం నాకు అర్థమయ్యింది. ఆగ్నేసు అతన్ని ప్రేమిస్తోందేమో నని అతని ఊహ.

అంతవరకూ అతన్ని ఓ చిన్న కుర్రాడికింద జమకట్టి అధికారం చెలాయించిన ఆమె, అతన్ని ప్రేమిస్తుందని అనుకోలేకపోతున్నాను.

నర్సులు సాధారణంగా ప్రేమల్ని వెతుక్కుంటూ పోతుండడం ఆశ్చర్యమేమీ కాదు. పరిసరాలు, పరిస్థితులు అందుకు దోహదం చేస్తాయి. రోజులో ఎక్కువ భాగం వాళ్ళ జీవితం రోగులు, రోగాలు, మందులు-వీటి మధ్యే గడిచి పోతుంది. వాళ్ళదంతా ఓ లోకం. బాధల జీవితాలమధ్య తిరుగాడుతూ, నటిస్తూ వాటికి అతీతంగా వుండిపోవాలి. అలా వుండిపోవాలీ అంటే తేలికయిన ఉత్సాహాన్ని వెతుక్కోవాలి. అందుకు అందుబాటులో వున్నది ప్రేమ ఒక్కటే. ఆ ప్రేమకై వాళ్ళు పరుగులెత్తడం ఆశ్చర్యకరమైనదీ, వింతయినదీ కానేకాదు.

అయినా ఆగ్నేసు నిత్యానందమూర్తిని ప్రేమిస్తోందని అనుకోలేక పోతున్నాను. భయంకరమైన వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి అతను. అతన్ని ప్రేమించడమనేది అతని జీవితంతో చెలగాటం ఆడడమే అవుతుంది. రోగుల సేవకై నియమింపబడిన ఆమెకు ఈ విషయం తెలియదని అనుకోలేం.

హాస్పిటలు చేరుకున్నాం.

ఆగ్నేసు డ్యూటీరూంలో కూర్చుని మరొక మేల్ నర్సుతో నవ్వుతూ మాట్లాడుతోంది. మేం రావడంచూసి, పగలబడి నవ్వుతున్న నవ్వుని ఆపుకుని "చూసొచ్చారా, రాళ్ళనీ రప్పల్నీ" అంది.

ఆమె వ్యంగ్యంగా అన్నా, నిజానికి ఆ కొండల్లో ఆమెకు కనిపించేవి రాళ్ళు రప్పలే! కళాదృష్టి యిలాంటి వ్యక్తులకు వుంటుందని అనుకోవడం పొరపాటే అవుతుంది. మరీ తక్కువ ఆలోచనల మనుషులు. సంగీతం వీళ్ళకు అక్కర్లేదు. సాహిత్యం అర్థంకాదు. మిగిలిన రెండు లలితకళల గురించీ అసలు వారెప్పుడూ ఆలోచించనైనా ఆలోచించరు. వాళ్ళ దృష్టిలో సంగీతమంటే సినిమా పాటలు పాడడమూ ఏ హార్మనీయో, బుల్‌బులో

వాయించడమూనూ. కవిత్వం ప్రేమలేఖలవరకే వీళ్ళకు పరిమితం. ఇల్లాంటి వ్యక్తులు కొండల్లో రాళ్ళనీ రప్పల్నీ, అడవుల్లో ఆకుల్నీ కొమ్మల్నీ తప్ప ఇంకేమీ చూడలేరు.

నాకు వేరే పనుండి వాళ్ళిద్దరి దగ్గరా శెలవు తీసుకొని వెళ్ళిపోయాను.

ఆ సాయంకాలం కామేశ్వరీ, నేనూ పబ్లిక్‌గార్డెన్స్‌కు వెళ్ళవస్తోంటే ఆగ్నేసు కనిపించింది. నలుగురమ్మాయిలు—ఇంచుమించు అదే వయసు వారితో కలిసి బస్‌స్టాపులో బస్సు గురించి ఎదురుచూస్తూ నుంచుంది.

వెంటనే ఆగ్నేసును గుర్తుపట్టలేకపోయాను. నన్ను చూపించి ప్రక్కనున్న స్నేహితురాళ్ళతో ఏదో చెప్తోంటే నిదానించి చూసి కొద్దిసేపటికి గుర్తుపట్టగలిగాను. చీరలో ఆమెను గుర్తుపట్టడం కొద్దిగా కష్టమే అయ్యింది అంత వరకూ తెల్లబట్టల్లో విసిగిపోయిన ఆమె, లేత నీలంరంగు చీర కట్టుకుంది. ఆమె స్నేహితురాళ్ళూ రంగుబట్టల్లోనే వున్నారు.

బస్సుగురించి నేనూ అదే స్టాపులో కొద్దిసేపు నుంచోవలసి వచ్చింది. అప్పుడు చూశాను, ఆమె తలలో నాలుగే నాలుగు గొబ్బిపూలు వడిలి వెనక్కువాలి వున్నాయి!

ఆశ్చర్యపోయాను నేను.

బస్సురాగానే ఆమె వెళ్ళిపోయింది.

చాలా రోజులవరకూ మళ్ళీ హాస్పిటలుకు వెళ్ళలేదు నేను. వీర్రాజు అక్కడ వుంటున్నప్పుడే కామేశ్వరీ, నేనూ ఒకసారి వెళ్ళాం. ఆ తర్వాత అతను జబ్బుబాగయి, డిశ్చార్జ్ అయిపోయాడు. కొద్దిరోజులు ఇంటిదగ్గరే వుండి మళ్ళీ ఉద్యోగంలో చేరాడు. అప్పుడప్పుడు మునుపటిలా ఇప్పుడూ, ఇంటికి వస్తున్నాడు. అతని ద్వారానే నిత్యానందమూర్తిని గురించి వింటూ వుండేవాడిని. వీర్రాజు వచ్చేసిన తర్వాత మరీ ఒంటరివాడయిపోయాడట అతను. "ఈ ఒంటరి తనాన్ని భరించ లేకపోతున్నానండీ" అని అనేవాడట.

పరిచయాలు కొద్దిపాటివే అయినా జ్ఞాపకాలు చిరకాలం నిలిచిపోతాయి కొంతమంది విషయంలో. నిత్యానందమూర్తి కూడా వాళ్ళల్లో ఒకడు. ఎప్పు

డయినా వెళ్ళి కలుసుకుందామనుకునే వాడినిగాని, ఏవో పనులు తగిలి, ఆ అవకాశం మాత్రం కలగడంలేదు.

ఓరోజు ఏమీ తోచక ఒకడ్నే సినిమాకు బయలుదేరాను. కామేశ్వరికి తల నొప్పిగావుండి రానంది. ఒక్కడ్నే వెళ్ళక తప్పలేదు.

సినిమా అట్టే నచ్చలేదు నాకు. డబ్బు చేసుకోవడానికి మన నిర్మాతలు వాస్తవాన్నుంచి ఎంతదూరమైనా వెళ్ళిపోగలరు అని నిరూపిస్తుంది ఆ చిత్రం.

సినిమా అయిపోయాక వచ్చేస్తోంటే వరండాలో నిత్యానందమూర్తి కనిపించాడు. అతని వెనక మరికాస్త దూరంలో ఆగ్నేసు జనాన్ని తప్పించు కొని యిటేవస్తోంది.

"సినిమాకు వచ్చారా. ఎలావుంది?" అన్నాడు నిత్యానందమూర్తి.

ఎలా వున్నదీ చెప్పాను.

వీర్రాజును గురించి ఏవేవో అడిగాడు.

చెప్తున్నాను.

ఆగ్నేసు మా పక్కనుంచే చూడనట్టుగా వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న ఆమెను చూస్తున్నాను.

"ఆగ్నేసు! తెలుసుకదూ మీకు. సినిమాకు వచ్చింది గాబోలు" అన్నాడు నిత్యానందమూర్తి.

జనంలో కలిసిపోయేముందు ఒకసారి ఆమె తలలోకి చూశాను. ఆ తలలో గొబ్బిపూలు రెండు జీవంలేనట్టు వెనక్కు వాలిపోతున్నాయి!

"ఆమె యింకా అల్లరి చేస్తున్నట్టేవుంది" అన్నాను. ఆ వ్యంగ్యం అతను అర్థం చేసుకున్నాడు గాబోలు, మాట్లాడలేదు.

"వెళ్తానండి. బస్సు దొరక్కపోతే చాలా ఆలస్యం అయిపోతుంది. సాయంకాలం నాలుగు గంటలు 'పర్మిషన్' పెట్టి వచ్చాను. ఎప్పుడైనా వీలు చూసుకుని హాస్పిటలుకు రండి" అన్నాడు. గబగబా జనాన్ని తప్పించుకుని వెళ్ళిపోయాడు.

అతను చేతులారా తన నాశనాన్ని తాను కొనితెచ్చుకుంటున్నాడేమో ననిపించింది నాకు. ఒకసారి వెళ్ళి అతన్ని కలుసుకుని మందలిద్దామని అనిపించింది.

రెండు రోజుల తర్వాత వీర్రాజు వచ్చి, నేను ఇంట్లో లేకపోతే కామేశ్వరి చేతికి ఓ ఉత్తరం యిచ్చి వెళ్ళాడట. నా అడ్రసు తెలియక, నా పేరుతో అతని అడ్రసుకు నిత్యానందమూర్తి రాశాడట ఆ వుత్తరాన్ని.

మామూలు పరిచయాలూ, పొగడ్తలూ అయిపోయాక అతను రాశాడు—

"........... ఇక్కడి జీవితానికి అర్థం ఏమని నిర్వచించాలో తెలీడం లేదు. భూత భవిష్యద్వర్తమానాలమధ్య కాలం కదలివస్తున్నప్పుడు, ఎలాంటి మార్పూ లేకుండా అతి నిరాడంబరంగా ఒకే రూపంలో పయనిస్తోంది. నిన్నే యివ్వాళ్ళే, యివ్వాళే రేపై యీ జీవితంలో ఆశించే వింతలు, సాధించే సాధితాలూ ఏవీ అవుపించడంలేదు. ఉదయం లేవడం, మందూ మాకుతోపాటు క్షుద్బాధకు ఏదోయింత తినడం, నిద్రపోయి లేవడం, తిని నిద్రపోయి తిరిగి లేవడం, కొద్దిపాటినడక, ఆఖరిగా తిని నిద్రపోవడం—ఇదీ యిక్కడి జీవితం. ఇంతకన్నా ఎక్కువ ఆశించకూడదు సాయంకాలపు ఆ కొద్దిపాటినడక చీకటిని చీల్చిన పగలుకు, వెలుతురును కాటేసిన రాత్రికి ప్రతినిధిగా నిలబడుతుంది. గడిచిపోయిన ఆలోచనలు ఆ రాత్రి కనబోయే కలలుగా రూపాల్ని మార్చుకునేది ఆ సాయంకాలమే.

అర్ధరాత్రి తెలివి వచ్చినప్పుడు ఆలోచనలు యింటిని వెతుక్కుంటూ పోతుంటాయి. పగటి భాగంలో యింటి తలంపు వచ్చినా ఇక్కడి మిత్రులు ప్రసంగంలోకి దింపి ఆలోచనల్ని దూరంగా తరిమేస్తారు. కాని, రాత్రి సమయంలో అది సాధ్యంకాదు. అంతా గాఢంగా నిద్రపోతుంటారు. నిద్ర తేలిపోయినవారు, నాలాగా కళ్ళు మూసుకుని చీకటిలోకి చూస్తూ ఒంటరిగా ఆలోచిస్తుంటారు. ఒకరిని ఒకరు పలకరించుకోవడం వుండదు. నిశ్శబ్దం గంభీరంగా, భయంకరంగా వుంటుంది. ఉండి—ఉండి ఆ గంభీరాన్ని ఛిన్నాభిన్నంచేస్తూ ఏ పక్కనుండో భయంకరంగా ఎడతెరిపిలేకుండా ఎవరో దగ్గుతారు. ఆ తర్వాత మళ్ళీ నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దంలో ఆలోచనలు ఆకృతిని దాలుస్తాయి. దూరమయిపోయిన మధురమైన ఆలోచనల్ని తలంచుకోవడానికి ఆ సమయంలో భయంవేస్తుంది. అతి సామాన్యమైన ఇంటి విషయాలే ఆలోచనల్లో దొర్లుతుంటాయి. ఎప్పుడో ఆలోచనల్లోంచి జాగ్రదావస్థలోకిదొర్లి, కలలో కరిగి, నిద్రలోకి జారిపోతాయి. ఉదయం ఎప్పటిలాగే ప్రభాతం—వెలుతురు రాలి, చీకట్లో కరిగి, పగలు ప్రారంభమవుతుంది.

ప్రతిరోజూ ఇదే జీవితం. యాంత్రికమైపోయింది. ఈ జీవితం నుంచి ఎప్పటికి విముక్తి వస్తుందో. అసలు విముక్తే రాదో—తెలియదు.

జీవితంలో అభిమానాలకు, ప్రేమలకు దూరమయిపోయిన వ్యక్తికి ఏవయిపునుంచయినా కొద్దిపాటి ఆత్మీయత కనిపిస్తే కొండంత ఉత్సాహం వస్తుందనే విషయం మీరు కాదనరనుకుంటాను. చీకటి సమాధిలో పండి పాలిపోతోన్న నేను వెలుతురు కావాలని, దానికై కళ్ళు కాయలు చేసుకోవడం వింతేమీ కాదు.

ఎప్పుడయినా ఒకసారి మీరు రండి. సన్నిహితంగా మాట్లాడుకోవచ్చు.

మీ

నిత్యానందమూర్తి"

నిత్యానందమూర్తి వట్టినే నాకు వుత్తరం రాయలేదని, ఆరోజు సినిమాలో అడిగినదానికి యివ్వాళ సమాధానం యిచ్చాడని అర్థమయింది. అతని వ్యక్తిగత జీవితంగురించి నాకేమీ తెలియదు. తెలుసుకొంటే బావుండేది.

ఆ విషయం ఆ తర్వాత వీర్రాజు వచ్చినప్పుడు అడిగాను.

అతనికి పెళ్ళి అయిందట. ఒక కూతురు కూడాను. అతనికి టి.బి. అని తెలిసిన తర్వాత మావగారు వచ్చి కూతుర్నీ, మనవరాలునీ తీసుకొని వెళ్ళిపోయారట. భార్య సరిగ్గా వుత్తరాలు వ్రాయదట ఒకసారి అయిదు రోజులు 'పర్మిషన్' తీసుకొని మావగారింటికి వెళ్తే భార్యను మాట్లాడడానికయినా ఒంటరిగా అతని వద్దకు రానివ్వలేదట. పిల్లను ఎత్తుకోనివ్వలేదట.

వీర్రాజు ఆవిషయంచెప్పి "ఆశలు చచ్చి జీవించడమంటే అదే. అతనికి బతుకుమీద కూడా నిర్లిప్తత ఏర్పడిపోయింది. "నాకు ఎవరూ లేరు. నేను

ఒంటరివాడ్ని—" అని తరచు అంటూ వుండేవాడు. ఆ భావనే రాకూడదు. వస్తే మనిషి మానసికంగా సుఖించలేడు" అన్నాడు.

నిత్యానందమూర్తి మీద చాలా జాలివేసింది. జీవితం మీద నిరాశ, నిర్లిప్తత ఆవరించిన అతను, ఏ పక్కనుంచో కొద్దిపాటి వెలుతురు చారలు అతని మీద వాలుతున్నప్పుడు తిరిగి ఆశను రగుల్చుకొని వాటిని అందుకో బోతే అవి నిప్పుసెగలై అతన్ని దహించి వేస్తాయేమోననే భయం కలుగు తోంది.

"ఆగ్నేసును గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాను వీర్రాజుతో.

అతను నవ్వి "మీరెందుకు అడిగారో నాకు తెలుసు. ఆగ్నేసు మంచిదని అనలేను కాని చెడ్డది మాత్రం కాదు. నిత్యానందమూర్తితో ఆమె చాలా సరదాగా మాట్లాడుతుంది. ఒక్కొక్కప్పుడు కొంటెగా ఏడిపిస్తుంది. మరొకప్పుడు నవ్విస్తుంది. అంతమాత్రంచేత ఆమెను తప్పుగా అర్థం చేసుకోగూడదు. నాకు తెలిసినంతమట్టుకు ఆమె అంతకన్నా సన్నిహితంగా వచ్చిందనిగాని, లేక వస్తుందనిగాని అనుకోలేక పోతున్నాను" అన్నాడు.

ఆగ్నేసును అనవసరంగా అనుమానించడం మంచిది కాదనిపించింది. నిత్యానందమూర్తి కోరినట్టు ఒకసారి వెళ్ళి అతన్ని కలుసుకుంటే అన్ని విషయాలూ తెలిపోతాయి.

కాని వెళ్ళి కలుసుకోవడం మాత్రం జరగలేదు. ఎప్పుడో స్వగ్రామానికి దగ్గరగా వెళ్ళిపోదామని చేసిన ప్రయత్నాలు యిప్పటికి ఫలవంతమయ్యాయి. "ప్రమోషన్"తో మా వూరికి దగ్గరగా వెళ్ళిపోతున్నాను. ఆర్డర్సు వచ్చాయి, ముఖ్యమైన మిత్రుల్ని, బంధువుల్ని కలుసుకోవడం, సామాను సర్దుకోవడం. "రిలీవింగు ఆర్డర్సు" తీసుకోవడం—వీటితో ఆ మూడురోజులూ తీరికలేక పోయింది. ఈ కొద్దిపాటి వ్యవధిలోనూ నిత్యానందమూర్తిని కలుసుకోవాలనే అభిప్రాయానికి ప్రాధాన్యత యివ్వలేకపోయాను. వీర్రాజుని మాత్రం కలుసుకుని, నిత్యానందమూర్తిని అడిగినట్టు చెప్పమన్నాను.

ఊరు వెళ్ళిపోయే రోజున వీర్రాజుకూడా స్టేషనుకువచ్చి సాగనంపాడు.

ఉద్యోగంలో చేరిన తర్వాత వీర్రాజుకు ఉత్తరం రాయమన్నాను కామేశ్వరిని. ఆమె మర్చిపోయినట్టుంది. రాయలేదు. చాలా రోజులు చూసి చూసి చివరకు వీర్రాజే ఉత్తరం రాసేవరకు మా యిద్దరికీ యీ విషయం జ్ఞాపకం లేనేలేదు!

క్షమాపణలతో వీర్రాజుకి ఉత్తరం రాశాను. ఆ ఉత్తరంలో అతన్ని ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోమని హెచ్చరిస్తూ, నిత్యానందమూర్తిని కూడా జాగ్రత్తగా వుండాలని చెప్పమని, అతని విషయాలు తెలియజేయమని రాశాను.

త్వరలోనే అతని వద్దనుండి సమాధానం వచ్చింది. తన ఆరోగ్యం బావున్నదట. నిత్యానందమూర్తి డిస్చార్జ్ కాబోతున్నాడట. స్ఫుటం కల్చర్ "పోజిటివ్" వచ్చిందని, అది "నెగటివ్" రావడంతోనే ఒక నెలరోజుల్లో అతన్ని డిస్చార్జ్ చెయ్యబోతున్నారని, అతని ఎక్సురే రిపోర్టు చాల బాగా వచ్చిందని రాశాడు.

చాలా కాలం తర్వాత అతను వెలుతుర్లోకి రాబోతున్నందుకు, అదృష్ట వంతుడైనందుకు అతనికి నా అభినందనలను అందజేయమని వీర్రాజుకు రాశాను.

తీరా ఉత్తరం పోస్టు చేసిన తర్వాత "అతను నిజంగా అదృష్టవంతు డేనా? అని ఆలోచించినప్పుడు 'ఔను' అని ధైర్యంగా సమాధానం చెప్పుకో లేక పోయాను. ఎవరివల్లనయితే అతను యింతవరకూ మనస్తాపాన్ని పొందుతూ వచ్చాడో, ఆ వ్యక్తుల మధ్యనే అభిమానాన్ని చంపుకుని సన్నిహి తంగా మెలగాల్సి వస్తున్నప్పుడు, పూర్వపు అనాదరణనూ, నిర్లక్ష్యాన్నీ మర్చి పోయి ప్రశాంతంగా ఉండగలడని అనుకోలేకపోతున్నాను. భార్య, అత్త మామలు—అంతా అతన్ని దూరంగా తరిమేశారు. అభిమానపు బంధాన్ని బలవంతంగా తెంచేసుకున్నారు తీరని వ్యధను కలిగించి మనశ్శాంతిని కొల్ల గొట్టారు. ఈనాడు అతను గతాన్ని మర్చిపోయి తెగిపోయిన బంధాలకు అతుకులు వేసుకున్నా, బలవంతంగా లాగినప్పుడు ఎక్కడికక్కడే అవి తెగిపోయే ఆస్కారం లేకపోలేదు.

అయినా మరీ యింత "సినికల్‌గా" నేను ఆలోచించడం మంచిది కాదేమో.

వీర్రాజు ఉత్తరం రాసి మూడు వారాలయినా కాలేదు, పిడుగులాంటి వార్త వచ్చింది.

నిత్యానందమూర్తి చనిపోయాడట! అంతకన్న ఆ కార్డులో విశేషాలు లేవు.

క్షణంపాటు స్తబ్ధుడ్నయిపోయాను. ఇల్లాంటివార్త చూడాల్సి వస్తుందని అనుకోలేదు. అంతకుముందు అతన్ని చూసిన వాళ్ళెవరూ ముందుముందు ఈ వ్యాధితోనే అతని బతుకు తెల్లారిపోతుందని అనుకుని వుండరు. ఆఖరిసారి నేను అతన్ని చూసినప్పుడుకూడా అలా ఊహించలేదు.

అతను నెలరోజుల్లో ఆ చీకటిని తప్పించుకొని వెలుతుర్లోకి రాబోతున్నాడని వీర్రాజు రాసి యింకా నెలరోజులయినా కాలేదు, యింతలోనే యీ వైపరీత్యం జరుగుతుందని ఎలా అనుకోను? పూర్తి ఆరోగ్యవంతుడై త్వరలోనే అతను బైట పడతాడని, ద్వేషాలూ కోపాలూ దాటుకుని, తనచుట్టూ తిరిగి ఆత్మీయతను సృష్టించుకోగలడనీ ఆశించాను. కాని అతను శాశ్వతంగా యీ కోపతాపాలకు దూరమయిపోతాడని అనుకోలేదు.

ఇదంతా ఏకారణమూ లేకుండా జరిగివుండదు. ఆరోగ్యాన్ని పుంజుకొంటూ నెలరోజుల్లో డిస్చార్జ్ కాబోయే అతను, మూడు వారాలు తిరక్కుండా మృత్యుముఖాన పడ్డాడంటే, ఇందులో విశేషం ఏదో వుండివుంటుంది.

నాకెందుకో అతని చావుకు, ఆగ్నేసుకు సంబంధం వుండివుంటుందని అనిపించింది.

మొదటినుంచీ నేను భయపడుతూనే వున్నాను, ఆగ్నేసు కారణంగా అతను తన జీవితాన్నే చేజేతులా నాశనం చేసుకుంటాడేమోనని. ఈనాడు అతను చనిపోవడానికి ఆగ్నేసే కారణం అనుకుంటే, అందుకు ఆశ్చర్యపడాల్సినదీ, అనుమాన పడాల్సినదీ ఏమీ లేనేలేదు.

ఆ తర్వాత వీర్రాజు వివరంగా ఉత్తరం రాశాడు. అతను రాసిన దానికీ, ఆగ్నేసే కారణం అన్న నా అభిప్రాయానికీ ఎక్కడా సంబంధంలేదు.

ఆఖరి రోజుల్లో భార్యకు నాలుగు ఉత్తరాలు రాశాడట. దేనికీ సమాధానం లేదట. ఆ విషయమూ, రక్తం కక్కుకుని వారం రోజులు మంచం మీద వుండి శాశ్వతంగా కన్నుమూయడమూ, బతికించాలనే డాక్టర్ల ప్రయత్నమూ—ఇంకా ఏవేవో రాశాడు. నాకు కావలసిన సమాచారం అతనివద్ద నుండి రాలేదు.

భార్య ప్రవర్తన కారణంగా తీవ్ర సంచలనంతో అశాంతిరేగి జీవితం మీద విసుగుతో ఆరోగ్యాన్ని అలక్ష్యంచేసి తన నాశనాన్ని తనే కొనితెచ్చుకున్నాడనే విషయం తప్ప, ఆగ్నేసుకు సంబంధించినది ఆ వుత్తరంలో ఏమీ లేదు.

ఆ తర్వాత కొంతకాలం వరకూ వీర్రాజు ఉత్తరాలు రాస్తుండేవాడు. ఎప్పుడూ ఈ ప్రస్తావన ఉత్తరాల్లో వుండేదేకాదు. తర్వాత తర్వాత అసలు ఉత్తరాలు రాయడమే మానేశాడు.

ఏణ్ణర్థం తర్వాత హైదరాబాదు వెళ్ళాల్సిన పనివచ్చింది. కామేశ్వరి బాబాయికూతురు పెళ్ళి. తప్పకుండా రావాలని వాళ్ళబాబాయి వరసగా మూడు ఉత్తరాలు రాస్తే బలవంతంగా నన్నుకూడా బయలుదేరదీసింది.

పెళ్ళిలో వీర్రాజు కనిపించాడు.

మధ్యాహ్నం భోజనాలు చేసినతర్వాత కాస్త తీరిక చిక్కింది. కాస్సేపు మాట్లాడుకుందామని వీర్రాజును పిలిపించాను.

"ఇక్కడేమిటి, సందడిలో. అలా బయటికి పోదాంరండి" అన్నాడు.

బట్టలు వేసుకుని బయటపడ్డాను.

అతని ఉద్యోగం, ఆరోగ్యం మొదలయిన విషయాలన్నీ అయిపోయాయి. పెళ్ళిగురించి ఏదో చెప్తున్నాను.

"పాపం! నిత్యానందమూర్తి విషయం చూశారా" అన్నాడు వీర్రాజు.

ఆ విషయం నేను మర్చిపోయినా, అతను జ్ఞాపకం చేశాడు. ఆగ్నేసు గురించి నా అభిప్రాయం సరియైనదో కాదో ఇప్పటికయినా తెలుసుకోవాలని అనిపించింది.

"ఇంతకూ అతను ఎలా చనిపోయాడు?" అన్నాను.

"ఏమో నాకూ తెలీదు. ఉత్తరంవస్తే చూద్దామని వెళ్ళాను. అప్పటికే అతను రెండు రోజులుగా రక్తం కక్కుకుంటున్నాడట. ఏమిటిది ? అని అడిగితే మాట్లాడలేదు. జాలిగా నవ్వేసి వూరుకున్నాడు" అన్నాడు.

"ఉత్తరంలో ఏమి రాశాడు ?"

"ఏమీలేదు. నాలుగే నాలుగు మాటలు ; ఇంటిదగ్గర కొచ్చేశాం. రండి, ఉత్తరం చూపిస్తాను" అన్నాడు.

మధ్యదారిలో అడగనే అడిగాను—అగ్నేసుకు, అతని చావుకు కారణం లేనే లేదంటారా—అని.

"ఇంత అకస్మాత్తుగా రోగం తిరగబెట్టడం చూస్తే అనుమానించాల్సి వస్తోంది మరి. హాస్పిటల్లో అంతా అలానే అనుకున్నారు. విచిత్రమేమంటే, ఏమీ లేకపోయినా నా గురించీ అలానే అనుకున్నారు" అన్నాడు.

"ఇల్లు చాలా దగ్గర్లోనే వుంది. తీసుకెళ్ళి కాఫీ తెప్పించి యిచ్చాడు. తాగుతున్నాను.

"ఆఖరి రోజుల్లో వాళ్ళవాళ్ళని రమ్మనమని టెలిగ్రాం యిద్దామనుకుంటే యివ్వనిచ్చాడు కాడు. అయినా అతనికి తెలియకుండా భార్యని, కూతుర్ని వెంటనే బయలుదేరి రమ్మనమని టెలిగ్రాం యిచ్చాను. వాళ్ళు రాలేదు, మామ గారు వచ్చారు. అప్పటికి జరగవలసినదంతా జరిగిపోయింది" అన్నాడు వీర్రాజు ఉత్తరం తెచ్చియిస్తూ.

నాలుగే నాలుగు లైనులున్న కార్డు అది. దుమ్ము దులిపితే వివరంగా అక్షరాలు కనిపించాయి.

"వీర్రాజుగారూ—

పండి రాలిపోయిన ఆకులస్థానే కొత్త చివుళ్ళు తలఎత్తుతున్నాయి. ఎందుకో మళ్ళీ బతకాలనిపిస్తోంది. నాలుగు రోజులుగా వంట్లో అదోలా వుంటోంది. ఒకసారి రండి, సన్నిహితంగా మాట్లాడుకుందాం.

మీ

నిత్యానందమూర్తి."

ఉత్తరంలోని మొదటి రెండు లైనులూ నా అభిప్రాయాన్ని మరీ బలపరిచాయి.

ఆగ్నేసుమీద నాకెంతైనా కోపం వచ్చింది. విలువైన జీవితాలతో సరదాగా చెలగాటమాడుతూ ఇలా ఎంతమందిని నాశనం చేసిందో, ఇంకా చేస్తుందో తెలీదు. ఉద్యోగంలో ప్రవేశించే ముందు అహర్నిశలూ రోగుల సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని ప్రమాణం చేసిన ఆమె, ఆ రోగుల ప్రాణాల్నే తీస్తోంటే ఏమనుకోవాలి ? చట్టరీత్యా ఇటువంటి వారిని శిక్షించినంత మాత్రాన వాళ్ళల్లో మానసిక పరివర్తన ఎలావస్తుంది ?

"ఎందుకులెండి, వద్దు" అని వచ్చేశాను.

"ఆగ్నేసు యిక్కడే వుంటోందా ?" అన్నాను వీర్రాజుతో.

"ఏమో నాకూ తెలీదు. ఉండే వుంటుంది.. ఏం, వెళ్ళి కలుద్దామా ?" అన్నాడు. అలాగే అన్నాను.

ఆ మర్నాటి ఉదయం వీర్రాజు వచ్చాడు. "హాస్పిటలుకు వెళ్దాంరండి. నాకు కూడా వేరే పనివుంది—ఆ ఎదురుగా వున్న కాలనీలో" అన్నాడు.

ఆగ్నేసును కలుసుకుని కాస్త గట్టిగా మందలిద్దామనిపించింది.

బయలుదేరాను.

వీర్రాజు పని చూసుకుని హాస్పిటలుకు వెళ్ళాం. ఆగ్నేసు గురించి వార్డులన్నీ వెతుకుతున్నాం.

మేట్రిన్ యిటేవస్తోంది.

ఆగ్నేసును గురించి ఆమెను అడిగాను.

"కలుసుకోవాలా ?" అంది ఆమె.

"ఊఁ" అన్నాను.

"మేడమీద ఫిమేల్ వార్డు——స్త్రీలోవుంది వెళ్ళండి" అంది.

ఆ వార్డుని వెతుక్కుని వెళ్ళే అక్కడ గుమ్మంలో మరో నర్సు ఎవరో వుంది. ఆగ్నేసు కనిపించలేదు.

ఆమెనడిగాను.

"మీ బంధువా ?" అని ప్రశ్నించింది

"కాదు" అన్నాడు వీర్రాజు.

ఆమె ఒకసారి జాలిగా మా యిద్దరివైపూ చూసి "ఇలా రండి" అంది.

అలా చూస్తుందేమిటి! అనిపించిందినాకు. ఆమె వెంబడే మెల్లగా బయలుదేరాం.

సౌందర్యం నిక్షిప్తమయిన ఆ గది అంతరాంతరాల్లో భయంకరమైన విషక్రిములుంటాయని ఎవరనుకోగలరు? క్రిమికి అందమూ, అనాకారితనమూ అనే భేదం లేదుగాబోలు!

నర్సు ఒక మంచంవద్ద ఆగిపోయింది.

ఆ యిరవైనాలుగో నెంబరు మంచంలో మృత్యువు మమ్మల్ని గుర్తుపట్టింది గాబోలు, జాలిగా నవ్వుతోంది.

ఆ స్థితిలో ఆగ్నేసును చూస్తానని ఎప్పుడూ అనుకోలేదు!

ఇప్పుడు నిజంగా నా అభిప్రాయానికి బలం వచ్చింది. నిత్యానందమూర్తి చావుకు ఆగ్నేసే కారకురాలు. ఆ విషయం స్పష్టపడిపోయింది. స్పుటం కల్చర్ పోజిటివ్ వున్నప్పుడు శారీరక సంబంధం ఏ స్త్రీతోనన్నా వుంటే, ఆమెకు కూడా ఆ జబ్బు అంటుకోవచ్చు. అందుచేత నిత్యానందమూర్తి చావుకు ఆగ్నేసే కారకురాలు.

ఆమె కనిపిస్తే గట్టిగా నాలుగు మాటలూ దులిపి కోపం అంతా వెళ్ళగక్కేద్దామని అనుకొని, తీరా ఆమె కనిపించిన తరువాత ఏమీ అనకుండానే వుండిపోయాను! తాత్కాలికమైన ఆనందానికి ఒకవ్యక్తి జీవితం నాశనం చేసిందని కోపంవచ్చినా, తన జీవితానికికూడా నాశనాన్ని కొనితెచ్చుకున్నంత తెలివి తక్కువది అయిపోయినందుకు ఆమెమీద జాలివేసింది.

ఎక్కువసేపు ఆమెతో మాట్లాడాలనిపించలేదు.

వెళ్ళేముందు "జీవితాలు చాలా విలువైనవి. అవి చెలగాటం ఆడ్డం కొరకు నియమించబడలేదు. ఆడటానికే అని ప్రవర్తిస్తే అది తెలివితక్కువతనమే అవుతుంది" అన్నాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

వెళ్తూ ఒకసారి వెనక్కు తిరిగి చూసినప్పుడు వెళ్ళిపోతున్న మాకు వీడ్కోలు యిస్తున్నట్టుగా జాలిగా మృత్యువు నవ్వుతోంది!

(1964)